


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 21-08-2026 సంపుటి : 08 సంచిక 66 పేజీలు : 8 వెల : రూ 3-00


# వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది కీలక ఆర్థిక శక్తిగా ఎదగాలి



మహాబలిపురం ,హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం చెన్నైలో జరిగింది. ఈ భేటికి ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం విజయ్, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి సీఎంలు హాజరయ్యారు. సమావేశంలో ఏపీ సహా దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి గురించి సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. దక్షిణాది రాష్ట్రాల మధ్య సహకారమే లక్ష్యమని వెల్లడించారు. కేంద్రం?రాష్ట్రాల మధ్య విశ్వాసం, పరస్పర సహకారంతో సమస్యల పరిష్కారం జరగాలని సీఎం సూచించారు. ఏపీ, కర్ణాటక, తమిళనాడును అనుసంధానించే బుల్లెట్ ట్రైన్ కారిడార్కు ప్రతిపాదన తెచ్చారు. కుప్పం మీదుగా బుల్లెట్ ట్రైన్ నడపాలని ప్రతిపాదించారు.

### వనరుల లోటు, సెక్షన్ 56లోని అంశాలను పరిష్కరించాలి
### సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి?బెంగళూరు?చెన్నై నగరాలను అనుసంధానించే రవాణా వ్యవస్థ ఉండాలని స్పష్టం చేసారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్వర్క్, డ్రై పోర్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. దక్షిణాది విద్యుత్ గ్రిడ్ను జాతీయ గ్రిడ్తో అనుసంధానించాలి. దక్షిణాది రాష్ట్రాల యూనివర్సిటీలు, స్కిల్లింగ్ సంస్థలతో ఉమ్మడి కన్సార్టియం ఏర్పాటు చేయాలని స్పష్టం చేసారు. విపత్తుల సమయంలో రాష్ట్రాలు పరస్పరం సహకరించుకునే మ్యూచువల్ ఎయిడ్ ఫోర్స్ ఏర్పాటు, తిరుపతి నుంచి కాశీ, అయోధ్య, చార్ధామ్ వరకు ఉమ్మడి ఆధ్యాత్మిక పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేయాలని కోరారు. దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 31 శాతం ఉందన్న సీఎం, 2047 నాటికి దక్షిణాది ఆర్థిక వ్యవస్థ 10 ట్రిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని వెల్లడించారు. వికసిత్ భారత్ నిర్మాణంలో దక్షిణాది కీలక ఆర్థిక శక్తిగా ఎదగాలనీ ప్రసంగంలో పేర్కొన్నారు. విభజన చట్టంలోని షెడ్యూల్ 9, 10 సంస్థలు 12 ఏళ్లుగా ఇంకా విభజనకు నోచుకోలేదనీ వెల్లడించారు.విభజన సమస్యల పరిష్కారానికి కేంద్రం వేగంగా చర్యలు తీసుకోవాలనీ కేంద్రాన్ని కోరారు. పోలవరం, సౌత్ కోస్ట్ రైల్వే జోన్, అమరావతి ప్రాజెక్టులు కేంద్ర సహకారంతో సాకారం అవుతున్నట్టు స్పష్టం చేసారు. అమరావతికి చట్టబద్ధ రాజధాని హోదా సాధించాం. వనరుల లోటు, సెక్షన్ 56లోని అంశాలను పరిష్కరించాలనీ కోరారు.

# స్థానిక ఎన్నికలకు జనసేన సిద్ధం..

### పవన్ కీలక ఆదేశాలు




అమరావతి, ఆగస్టు 20: ఆంధ్రప్రదేశ్లో స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన సమాయత్తమవుతోంది. ఈ మేరకు అమరావతిలో పవన్ కల్యాణ్ అధ్యక్షతన జరిగిన శాసనసభాపక్ష సమావేశంలో ఎన్నికల వ్యూహంపై కీలక చర్చ జరిగింది. శాసనసభ ఎన్నికల సమయంలో పొత్తు ధర్మాన్ని పాటిస్తూ.. పార్టీ కోసం నిలబడిన జనసేన కార్యకర్తల ఆత్మగౌరవాన్ని కాపాడే విధంగా స్థానిక ఎన్నికల్లో బరిలోకి దిగాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కార్యకర్తల అభిప్రాయాలు, మనోభావాలను గౌరవించేలా ఎన్నికలకు సిద్ధం కావాలని నేతలు భావించారు. రాష్ట్రంలోని 21 జనసేన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిపై పవన్ కల్యాణ్ ఆరా తీశారు. అలాగే ఆయా నియోజకవర్గాలతో పాటు పార్టీకి బలమున్న ఇతర ప్రాంతాలను గుర్తించి స్థానిక ఎన్నికలకు వ్యూహం సిద్ధం చేయాలని నేతలు నిర్ణయించారు.మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు నిర్వహించడం మంచిదేనని సమావేశంలో ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. నియోజకవర్గాల్లో పార్టీ బలాబలాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని పవన్ కల్యాణ్ సూచించారు. కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లకు సంబంధించి నియోజకవర్గాల్లో ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులపై కూడా సమావేశంలో చర్చించారు. కార్యకర్తలు చెబుతున్న సమస్యలను ఎమ్మెల్యేలు స్వయంగా విని.. వాటి పరిష్కారానికి కృషి చేయాలని పవన్ సూచించారు. జనసేన యంత్రాంగం స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిస్తూ.. పొత్తుల అంశాన్ని తాను చూసుకుంటానని స్పష్టం చేశారు. ఎవరూ పార్టీ లైన్ దాటి మాట్లాడవద్దని నేతలకు.. కార్యకర్తలకు పవన్ కల్యాణ్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

## అసెంబ్లీకి రాకుండా పారిపోతున్న జగన్: మంత్రి లోకేశ్

అమరావతి, ఆగస్టు 20: ఆంధ్రప్రదేశ్లో నిర్వహించే పరీక్షల వ్యవస్థపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్కు అవగాహన లేదని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి లోకేశ్ గురువారం కౌంటర్ ఇచ్చారు. ఏపీపీఎస్సీ, డీఎస్సీ రెండూ ఒకటే అనుకుంటున్నారా? అంటూ వైసీపీ అధినేతపై మండిపడ్డారు. ంఖఖూఅ అంటే ఏమిటో, ఆూఅ అంటే ఏమిటో జగన్కు తెలియదంటూ వ్యంగ్యంగా అన్నారు. ఈ రెండు పరీక్షలను ఒకే గాటిన కట్టడం, ఒకటే అనుకోవడం జగన్ అవగాహన స్థాయిని తెలియజేస్తుంటూ ఎద్దేవా చేశారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించ లేదని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు డీఎస్సీ నిర్వహించ లేకపోయారు.. ప్రస్తుతం అసెంబ్లీలో చర్చకు రాకుండా పారిపోతున్నారంటూ జగన్కు చురకలంటించారు పరీక్షల వ్యవస్థపై అవగాహన లేని వ్యక్తి ఇప్పుడు ప్రశ్నలు లేవనెత్తుతున్నారంటూ జగన్పై మంత్రి లోకేశ్ నిప్పులు చెరిగారు.డీఎస్సీ, ఏపీపీఎస్సీ మధ్య తేడా తెలియని వైఎస్ జగన్కు పరీక్షలపై మాట్లాడే అర్హత ఉందా? అంటూ ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు మంత్రి లోకేశ్ తన ఎక్స్ ఖాతా వేదికగా జగన్కు కౌంటర్ ఇచ్చారు.



# అమరావతిలో ఎంట్రీకి అందుబాటులోకి రానున్న మరిన్ని రహదారులు.. మంత్రి సమీక్ష



అమరావతి, ఆగస్టు20: రాజధాని అమరావతిలో ఎంట్రీకి మరిన్ని రహదారులను త్వరితగతిన అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అందులో భాగంగా సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభంతో ఇతర రహదారుల కనెక్టివిటీపై మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి నారాయణ దృష్టి సారించారు. గురువారం ఇ 13, ఇ 15, ఇ 1, ఇ 3 రహదారి నిర్మాణ పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.మంగళగిరి నుంచి అమరావతికిలోకి ప్రవేశించే ఇ 15 రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రికి అధికారులు వివరించారు.16వ నెంబర్ జాతీయ రహదారి నుంచి ఎయిమ్స్ ద్వారా అమరావతిలోకి ఇ 13 రోడ్డు ప్రవేశించనుంది. సీడ్ యాక్సెస్ రోడ్డు (ఇ 3) మూడో ఫేజ్లో నిర్మించే ఎలివేటెడ్ కారిడార్ (స్టీల్ బ్రిడ్జి – మణిపాల్ హాస్పిటల్) పనులు కూడా త్వరగా ప్రారంభించాలని అధికారులకు మంత్రి నారాయణ సూచించారు.సీడ్ యాక్సెస్ రోడ్డుకు సమాంతరంగా కరకట్టను వెడల్పు చేస్తూ ప్రకాశం బ్యారేజీ వరకూ ఇ 1 రోడ్డును నిర్మిస్తున్నారు. ఆయా రోడ్ల నిర్మాణాలకు అవసరమైన రైల్వే ఇతర అనుమతులు దాదాపు కొలిక్కి వచ్చాయని మంత్రి నారాయణ దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. రోడ్ల పనులకు ఆటంకాలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని గుంటూరు జిల్లా కలెక్టర్ను ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశానికి సీఆర్డీఏ కమిషనర్ విజయరామరాజు, అడిషనల్ కమిషనర్ కార్తీక్, గుంటూరు జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మతోపాటు వివిధ శాఖల ఇంజినీర్లు హాజరయ్యారు.

## పరిశ్రమను పరిశీలించిన కలెక్టర్--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 20: ఎస్పీవై రెడ్డి ఆగ్రో ఇండస్ట్రీని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా గురువారం సందర్శించి పరిశ్రమ కార్యకలాపాలు, ఉత్పత్తి ప్రక్రియ, భద్రతా ప్రమాణాలు, పర్యావరణ పరిరక్షణ చర్యలను పరిశీలించారు.రెవెన్యూ, ఎక్సైజ్, పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ మండలి, ఫ్యాక్టరీస్, కార్మిక శాఖల అధికారులతో కలిసి పరిశ్రమలోని ఉత్పత్తి ప్రక్రియ, కార్మికుల భద్రత, బై-ప్రొడక్ట్స్ నిర్వహణ, గ్రీనరీ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.కార్మికుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ అన్ని ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ సూచించారు. పరిశ్రమ కార్యకలాపాల వల్ల పర్యావరణానికి ఇబ్బందులు కలగకుండా కాలుష్య నియంత్రణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమ పరిసరాల్లో గ్రీనరీ, పరిశుభ్రతను మరింత పెంచాలని సూచించారు.



# ఏపీలో వర్షాలు..

### ఆ రెండు జిల్లాల ప్రజలకు బిగ్ అలర్ట్



అమరావతి, ఆగస్టు20: ఆంధ్రప్రదేశ్లోని పలు చోట్ల శుక్రవారం వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. పోలవరం, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు పడతాయని వివరించింది. ఈ రెండు జిల్లాల్లో పిడుగులు పడతాయని హెచ్చరించింది. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వివరించింది.ఈ నాలుగు జిల్లాల్లో కొన్ని చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మిగతా కోస్తా జిల్లాల్లో చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు పడతాయని చెప్పింది. ఈ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించింది. పిడుగులు పడే సమయంలో సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ప్రజలకు ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది.




# సంపాదకీయం

శుక్రవారం 21-08-2026

## మక్కా ఒప్పందం ముంచుతుందా...

పాకిస్తాన్ గత వారం సౌదీ అరేబియా, తుర్కియేలతో కలిసి ఒక కొత్త భద్రతా ఒప్పందంపై సంతకం చేసింది. ఈ ఒప్పందాన్ని 'మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్' అని పిలుస్తున్నారు. ఒప్పందం, మిడిల్ ఈస్ట్‌లో రూపుదిద్దుకుంటున్న కొత్త భద్రతా వ్యవస్థలో పాకిస్తాన్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. అలాగే ఆ ప్రాంతంలో దాని వ్యూహాత్మక ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడానికి సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. పాకిస్తాన్, సౌదీ అరేబియాల మధ్య ద్వైపాక్షిక రక్షణ ఒప్పందం కుదిరిన ఏడాదిలోపే ఈ మక్కా ఒప్పందం రూపుదిద్దుకుంది. భవిష్యత్తులో మరికొన్ని దేశాలు కూడా ఈ రక్షణ కూటమిలో చేరే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇది కచ్చితంగా పాకిస్తాన్‌కు కలిసివచ్చే అంశమే. భారత్‌పై సాధించిన పెద్ద దౌత్య విజయంగా దీన్ని చూపించుకోవడానికి పాకిస్తాన్ శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తుంది. అయినప్పటికీ, భారత్‌కు వ్యతిరేకంగా జరిగే ఏ ఉమ్మడి సైనిక చర్యలోనైనా పాల్గొనే ఉద్దేశం తుర్కియే, సౌదీ అరేబియాలకు ఉందని నేను అనుకోను. ఈ ఒప్పందంలో చేరడానికి ఆ రెండు దేశాలకు సొంత కారణాలు, వేర్వేరు ప్రయోజనాలు ఉన్నాయి" అని శ్యామ్ సరన్ అంటున్నారు." తుర్కియేతో పాకిస్తాన్ సంబంధాల కంటే, చైనాతో దాని సైనిక కూటమే భారత్‌కు అత్యంత ప్రమాదకరమైనదని నా ఉద్దేశం. దీనితో పాటు మనం ఆందోళన చెందాల్సిన మరో విషయం ఏంటంటే... అమెరికా మళ్లీ పాకిస్తాన్‌తో సన్నిహిత సైనిక సంబంధాలను ప్రారంభించడం. అమెరికా, చైనా రెండింటి మద్దతు మళ్లీ పాకిస్తాన్‌కు లభించడం అనేది మక్కా ఒప్పందం కంటే భారత్‌కు అత్యంత ఆందోళన కలిగించే అంశం" అని శ్యామ్ సరన్ విశ్లేషించారు. మక్కా ఒప్పందం వల్ల మధ్య ప్రాచ్యంలో ముస్లిం మెజారిటీ దేశమైన పాకిస్తాన్ ప్రభావం పెరుగుతుందని ఆగస్టు 12న ఫారిన్ పాలసీ అనే మ్యాగజీన్‌లో ప్రచురితమైన ఒక వ్యాసంలో థింక్ ట్యాంక్ 'అట్లాంటిక్ కౌన్సిల్' సౌత్ ఏషియా సీనియర్ ఫెలో మైకేల్ కుగెల్‌మన్ రాశారు."తమ దేశాన్ని ఒక బాధ్యతారాహిత్యమైన లేదా అస్థిరమైన భాగస్వామిగా కాకుండా, ప్రపంచస్థాయి శక్తిగా చూపించుకోవాలని పాకిస్తాన్ నాయకులు కోరుకుంటున్నారు. కాబట్టి ఇది వారికి చాలా ముఖ్యం. పైగా పాకిస్తాన్ వ్యూహాత్మక ప్రయోజనాలకు మిడిల్ ఈస్ట్ అత్యంత కీలకమైనది. అక్కడ దానికి ప్రధాన మిత్రదేశాలు ఉన్నాయి. పాకిస్తాన్ దిగుమతి చేసుకునే అధిక శాతం ఇంధనం అక్కడి నుంచే వస్తుంది. అలాగే లక్షల మంది పాకిస్తానీలు అక్కడ ఉపాధి పొందుతున్నారు" అని ఆ వ్యాసంలో కుగెల్‌మన్ పేర్కొన్నారు. అయితే, భారత్ పరంగా చూస్తే, ఈ ఒప్పందం వల్ల పాకిస్తాన్‌కు పెద్దగా ఒరిగేదేమీ ఉండదని ఆయన స్పష్టం చేశారు."సౌదీ అరేబియా, తుర్కియేలతో పాక్ కుదుర్చుకున్న ఈ ఒప్పందం పాకిస్తాన్‌కు తన సరిహద్దు భద్రతా విషయంలో ఉపయోగపడకపోవచ్చు. పాకిస్తాన్ భారత్‌తో గతంలోనూ, అలాగే నిరుడు జరిగిన ఘర్షణలతో సహా అనేక యుద్ధాలు చేసింది. ఇది కాకుండా, ఇప్పుడు అఫ్గానిస్తాన్‌లోని తాలిబాన్ ప్రభుత్వంతో కూడా తరచుగా సరిహద్దు ఘర్షణలు జరుగుతున్నాయి. కానీ అసలు నిజం ఏమిటంటే, పాకిస్తాన్ మిత్రదేశాలు దాని కోసం నేరుగా యుద్ధంలోకి దిగే అవకాశం లేదు" అని కుగెల్‌మన్ రాశారు.'ఒకవేళ పాకిస్తాన్‌పై భారత్ దాడి చేసినా.. భారత్‌కు వ్యతిరేకంగా సౌదీ అరేబియా ఆయుధాలు చేపడుతుందని అనుకోవడం అసంభవం. ఎందుకంటే, భారత్ కూడా సౌదీకి అత్యంత సన్నిహిత భాగస్వామి. తాలిబాన్ విషయంలోనూ దీని సంకేతాలు ఇప్పటికే కనిపిస్తున్నాయి. గత అక్టోబరులో అఫ్గానిస్తాన్ - పాకిస్తాన్ సరిహద్దుల్లో ఘర్షణలు చెలరేగాయి. సౌదీ అరేబియాతో ద్వైపాక్షిక రక్షణ ఒప్పందం కుదిరిన కొద్దికాలానికే ఈ ఘర్షణలు మొదలయ్యాయి. అయినప్పటికీ, సౌదీ అరేబియా ఆ ఒప్పందాన్ని అమలు చేస్తామని లేదా ఆ ఒప్పందం ప్రకారం ఈ ఘర్షణల్లో జోక్యం చేసుకుంటామని ఎప్పుడూ అనలేదు" అని మైకేల్ కుగెల్‌మన్ వివరించారు. ఇస్లాం పరంగా అత్యంత ప్రాముఖ్యత ఉన్న నగరంలో మూడు ప్రధాన ముస్లిం దేశాలు ఈ ఒప్పందం కుదుర్చుకున్నాయి. దాంతో ఈ కూటమి భవిష్యత్తులో ఇతర ముస్లిం దేశాలను కూడా తనతో కలుపుకుని ముందుకు వెళ్తుందనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ కూటమి 'ముస్లిం నేటో' రూపాన్ని సంతరించుకుంటుందా? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఈజిప్ట్, ఖతర్, అజర్‌బైజాన్, జోర్డాన్, సిరియా దేశాలు భవిష్యత్తులో ఈ కూటమి విస్తరణలో చేరే అవకాశమున్న సహజమైన భాగస్వాములని 'మిడిల్ ఈస్ట్ కౌన్సిల్ ఆన్ గ్లోబల్ అఫైర్స్' సీనియర్ నాన్-రెసిడెంట్ ఫెలో అలీ బాకిర్ అన్నారు. నేటోలో రెండో అతిపెద్ద సైనిక శక్తి ఉన్న దేశం తుర్కియే. ప్రపంచంలోనే ఏకైక ముస్లిం అణుశక్తి దేశం పాకిస్తాన్. ఇక సౌదీ అరేబియా అనేది అపారమైన చమురు, ఆర్థిక బలం, పాశ్చాత్య ఆయుధాలు ఉన్న దేశం. ఈ మూడు శక్తులు ఒకే వేదికపైకి రావడం అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఒకవేళ ఏదైనా దాడి జరిగినప్పుడు ఈ కొత్త కూటమి ఎలాంటి ఉమ్మడి చర్యలు తీసుకుంటుందనే దానిపై ఇప్పటికీ ఒక స్పష్టత లేదని 'అట్లాంటిక్ కౌన్సిల్' నాన్-రెసిడెంట్ సీనియర్ ఫెలో డానీ సిట్రినోవిచ్ అన్నారు.'ఈ సైనిక కూటమిలోని దేశాలకు ఒక ఉమ్మడి శత్రువు లేనప్పుడు రక్షణ రంగంలో పరస్పర సహకారం మాత్రమే సాధ్యమవుతుందని, ఉమ్మడి రక్షణ కూటమి సాధ్యం కాదని అన్నారు."సాధారణంగా ఉమ్మడి రక్షణ అనేది అందరికీ ఉన్న ఒకే ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా ఉంటుంది. ఉమ్మడి శత్రువు లేనప్పుడు రక్షణ రంగంలో పరస్పర సహకారం మాత్రమే పెరుగుతుంది.

# కల్తీ మద్యం తాగి ఏడుగురు మృతి..

## 30 మంది ఆసుపత్రిపాలు

గాంధీనగర్: మిథనాల్ కలిపిన కల్తీ మద్యం తాగి ఏడుగురు వ్యక్తులు మరణించారు. మరో 30 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో 12 మంది కల్తీ మద్యం వ్యాపారులను పోలీసులు అరెస్ట్ చేశారు. 21 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మద్యపాన నిషేధం అమలులో ఉన్న గుజరాత్‌లో ఈ సంఘటన జరిగింది. మంగళవారం సాయంత్రం భావనగర్ జిల్లాలోని ఒక గ్రామంలో మద్యం పార్టీ చేసుకున్న ఐదుగురు స్నేహితులు అస్వస్థతకు గురయ్యారు. పలు గ్రామాల ప్రజలతో పాటు భావ్‌నగర్ నగరంలోని పలు ప్రాంతాల



వారు కూడా నకిలీ మద్యం కారణంగా ఆసుపత్రిపాలయ్యారు. కాగా, మిథనాల్ కలిపిన కల్తీ మద్యం తాగి ఏడుగురు వ్యక్తులు మరణించగా, మరో 30 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు, జిల్లా అధికారులు అలెర్ట్ అయ్యారు. మరణించిన, చికిత్స పొందుతున్న రోగుల నుంచి సేకరించిన రక్త నమూనాల్లో విషపూరితమైన మిథనాల్ ఆనవాళ్లు కనిపించాయి. 'ఇండియన్-మేడ్ ఫారిన్ లిక్కర్' పేరుతో విక్రయించిన కల్తీ మద్యంపై దర్యాప్తు చేశారు. మరోవైపు మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన నరేంద్ర సింగ్ యాదవ్ అలియాస్ 'డాక్టర్' పర్యవేక్షణలో కల్తీ మద్యం వ్యాపారి గౌతమ్ సోలంకి ఇంట్లో విషపూరిత మద్యం తయారు చేసినట్లు పోలీసులు గుర్తించారు. సరస్, గణేష్, అమన్ అనే వ్యక్తులు మిథనాల్ కలిపిన మద్యం తయారీలో పాల్గొన్నట్లు దర్యాప్తులో బయటపడింది. నరేంద్ర సింగ్ యాదవ్ దానిని సేవించగా మరుసటి రోజు అతడి పరిస్థితి విషమించింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడంతో కల్తీ మద్యం తయారీ గుట్టురట్టయ్యింది. ప్రధాన నిందితుడైన ఉజ్జయిన్‌కు చెందిన రయీస్, జుబేర్, గౌతమ్ సోలంకిలతో కలిసి ముడి పదార్థాలు తీసుకువచ్చినట్లు పోలీసులు గుర్తించారు. ఈ ముగ్గురూ అహ్మదాబాద్‌లోని సర్ఖేజ్ నుంచి తెల్లటి ద్రవం, ఖాళీ సీసాలు, సీసా మూతలు, నకిలీ 'రాయల్ స్టాగ్' స్టిక్కర్లు, మిథనాల్ కొనుగోలు చేసి కల్తీ మద్యం తయారు చేశారు. విషపూరిత రసాయనాన్ని అసలైన మద్యంలా కనిపించేలా బాటిల్స్‌పై నకిలీ 'రాయల్ స్టాగ్' స్టిక్కర్లు అతికించారు. అయితే పోలీసులు స్వాధీనం చేసుకున్న కల్తీ మద్యం సీసాలలో 38.59 శాతం మిథనాల్, కేవలం 0.94 శాతం ఇథనాల్ ఉన్నట్లు గాంధీనగర్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) నివేదికలో తేలింది. దీంతో అది సాధారణ మద్యం కాదని, అత్యంత విషపూరితమైన మిథనాల్ ఆధారిత మిశ్రమమని నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలో గుజరాత్, మధ్యప్రదేశ్‌కు చెందిన 12 మంది కల్తీ మద్యం వ్యాపారులను అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. 21 మంది నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# తల్లి కష్టాలను గుర్తు చేసుకున్న రాహుల్ గాంధీ.. సోషల్ మీడియాలో భావోద్వేగ పోస్టు




సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' త్వరలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తన తల్లి సోనియా గాంధీ జీవితంలో ఎదుర్కొన్న కష్టాలను గుర్తు చేసుకుంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా భావోద్వేగ పోస్టు పెట్టారు. తన తండ్రి రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని ఈ పోస్టు షేర్ చేశారు. తల్లిని చూస్తూ ప్రస్తుతం తన తండ్రి గర్వపడుతుంటారని వ్యాఖ్యానించారు. సోనియా గాంధీ కుమార్తె ప్రియాంక గాంధీ కూడా తన మనసులో మాటను నెట్టింట పంచుకున్నారు. 35 ఏళ్ల క్రితం తల్లిదండ్రులిద్దరినీ చివరిసారిగా చూశానని రాహుల్ గాంధీ భావోద్వేగానికి గురయ్యారు. 1991లో రాజీవ్ గాంధీ హత్యానంతరం సోనియా ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నారంటూ భావోద్వేగానికి గురయ్యారు. సవాళ్లను హుందాగా ఎదుర్కొని అధిగమించారని ప్రశంసించారు. తమ తల్లి జీవితంలో ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితుల గురించి తనకు, తన సోదరి ప్రియాంకకు మాత్రమే తెలుసునని అన్నారు. వ్యక్తిగత విషయాల గురించి ఎప్పుడూ బహిరంగంగా పెద్దగా మాట్లాడని తన తల్లి ఆ విశేషాలను పుస్తక రూపంలో పంచుకునేందుకు ముందుకు రావడం చూసి తానెంతో గర్వపడుతున్నానని వ్యాఖ్యానించారు. తన తల్లిదండ్రులది అద్భుతమైన ప్రేమబంధమని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు. హృదయంలోని భావోద్వేగాలకు నిజాయతీతో అక్షర రూపం ఇచ్చిన తన తల్లిని చూస్తుంటే ఎంతో గర్వంగా ఉందని అన్నారు. ఎంతో సహృదయంతో వ్యవహరించే తన తల్లి అవసరమైన సందర్భాల్లో ధీరవనితగా మారిపోతుందని కూడా ప్రశంసలు కురిపించారు. ఇప్పటివరకూ సోనియా గాంధీని రాజకీయ నేతగా మాత్రమే చూసిన వారికి ఈ పుస్తకంతో ఆమె వ్యక్తిగత జీవితం గురించి తెలుసుకునే అవకాశం దక్కుతుందని అన్నారు. సోనియా గాంధీ జీవితం ఆమెకు దేశంపై కుటుంబంపై ఉన్న ప్రేమకు తార్కాణంగా నిలుస్తోందని వ్యాఖ్యానించారు. ఇక ఈ పుస్తకం నవంబర్ 10న విడుదల కానుంది.

# జెన్ జీ పేరుతో బెదిరింపులా? వైరల్ వీడియోపై వీకే సింగ్ కీలక వ్యాఖ్యలు

లద్దాఖ్‌లోని మినామార్గ్ చెక్‌పోస్టు వద్ద ఓ పర్యాటకురాలు భద్రతా సిబ్బందితో వాగ్వాదానికి దిగిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వాహనాలను చాలాసేపు నిలిపివేయడంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేస్తూ సిబ్బందిని ప్రశ్నించినట్లు వీడియోలో కనిపిస్తోంది. తాము జెన్ జీ తరానికి చెందినవారమని పేర్కొంటూ, ఇలాంటి పరిస్థితులను అంగీకరించబోమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై మాజీ ఆర్మీ చీఫ్, కేంద్ర మాజీ మంత్రి జనరల్ వీకే సింగ్ స్పందించారు. సాయుధ బలగాలు దేశానికి రక్షణ కవచంలా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. సైనికులపై విమర్శలు చేసే ముందు అక్కడి పరిస్థితులు, వాస్తవాలను పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా సైనికులపై ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. దేశ రక్షణ కోసం విధులు నిర్వర్తిస్తున్న సైనికులకు ప్రజలు అండగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. లద్దాఖ్‌లోని మినామార్గ్ ప్రాంతంలో వాహనాలను గంటల పాటు నిలిపివేయడంతో పర్యాటకురాలు భద్రతా సిబ్బందిని ప్రశ్నించినట్లు



సమాచారం. కుటుంబాలతో, చిన్న పిల్లలతో ప్రయాణిస్తున్న వాహనాలను ఎందుకు ఎక్కువసేపు ఆపారని ఆమె నిలదీసినట్లు వైరల్ వీడియోలో కనిపిస్తోంది. ఆ సమయంలో భద్రతా కాన్వాయ్ అక్కడికి చేరుకోవడంతో రహదారి పక్కకు వెళ్లాలని సిబ్బంది ఆమెకు సూచించినట్లు తెలుస్తోంది. దీంతో రహదారిని కేవలం వీఐపీ కాన్వాయ్ కోసం మాత్రమే నిలిపివేశారని ఆమె ఆరోపించినట్లు సమాచారం. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి పూర్తి వివరాలు, అధికారిక వివరణ ఇంకా స్పష్టంగా వెలువడాల్సి ఉంది. లద్దాఖ్‌లోని పర్వత ప్రాంతాల్లో ప్రతికూల వాతావరణం, రహదారి పరిస్థితులు, భద్రతా కారణాల దృష్ట్యా వాహనాల రాకపోకలను నియంత్రించడం సాధారణమేనని అక్కడి అధికారులు పేర్కొన్నారు. వైరల్ వీడియోపై జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కూడా స్పందించారు. గతంలో కొందరు రాజకీయ నాయకుల పిల్లలు తమ తండ్రి పేరు చెప్పి అధికారులను బెదిరించేవారని గుర్తుచేశారు. ఇప్పుడు 'మేము జెన్ జీ' అంటూ చెప్పడం మరో రకమైన బెదిరింపుగా మారిందంటూ ఆయన వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.


# భాషను మార్చుకో..నోటిని అదుపులో పెట్టుకో : రేవంత్‌కు తలసాని హెచ్చరిక



హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన భాష ను మార్చుకోవాలని, నోటిని అదుపులో పెట్టుకోవాలని మాజీమంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. గురువారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. బాధ్యత గల పదవిలో ఉంటూ గౌరవం, సంస్కారం లేకుండా నోటికొచ్చినట్లు మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. కరోనా సమయంలో సరిపడా ఆక్సిజన్, బెడ్ లు లేక ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్ అవసరాల కోసం ముందు చూపుతో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం సనత్ నగర్, అల్వాల్, కొత్తపేట ప్రాంతాలలో కార్పొరేట్ స్థాయి హాస్పిటల్స్ నిర్మాణ పనులు చేపట్టిందని వివరించారు. తమ ప్రభుత్వ హయాంలోనే 60 శాతం పనులు పూర్తయ్యాయి అనే విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. సనత్ నగర్ టిమ్స్‌ను కట్టామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పుకోవడం అవివేకమని విమర్శించారు. హాస్పిటల్ లో అవసరమైన సౌకర్యాలు, వసతులు కల్పించకుండా హడావుడిగా ప్రారంభించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. హాస్పిటల్ ప్రారంభోత్సవ సభలో అధికారిక కార్యక్రమం అనే సోయి లేకుండా వైద్యులు, నర్సింగ్ విద్యార్థుల ముందు ముఖ్యమంత్రి నోటికొచ్చినట్లు పచ్చి అబద్దాలు మాట్లాడారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు రేవంత్ రెడ్డి రిబ్బన్ కటింగ్ లు చేస్తున్నారని ఆరోపించారు. తమకు సంస్కారం అడ్డం వస్తుందని, లేదంటే మీకన్నా ఎక్కువ మాట్లాడగలమని చెప్పారు. ప్రజాపాలన అని ఒక వైపు ప్రచారం చేసుకుంటూ మరో వైపు నిర్బంధాలు, అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కమిషన్ ల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం 22 ఏ తీసుకొచ్చిందని తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద ప్రజల ఇండ్లు, ప్రయివేట్ భూములను 22 ఏ లో చేర్చే అధికారం మీకు ఎవరు ఇచ్చారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 22 ఏ ను అడ్డం పెట్టుకొని భూముల యజమానులను భయపెట్టి 30 నుండి శాతం కమిషన్ లను వసూలు చేసిన మాట వాస్తవం కాదా? అని నిలదీశారు. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వం తప్పిదాలు చేసి అధికారులపై నెపం పెట్టి ప్రభుత్వం తప్పించుకోవాలని చూస్తుందని విమర్శించారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్లు నామన శేషుకుమారి, అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, బీఆర్ఎస్ డివిజన్ పార్టీ అధ్యక్షులు కొలన్ బాల్ రెడ్డి, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, గుర్రం పవన్ కుమార్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

# సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసు దోషి సజ్జన్ కుమార్ మృతి.. తిహార్ జైల్లో కన్నుమూత

మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్యానంతరం జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్ (80) కన్నుమూశారు. ఢిల్లీలోని తీహార్ జైల్‌లో ఉన్న ఆయనను గురువారం సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మరణించినట్టు వైద్యులు తెలిపారు. సజ్జన్ మృతికి గల కారణాలు ఆసుపత్రి వర్గాలు ఇంకా వెల్లడించాల్సి ఉంది. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 1984లో సిక్కు మతస్తులైన తన బాడీ గార్డుల చేతిలో హత్యకు గురైన విషయం తెలిసిందే. ఆ తరువాత ఢిల్లీ సహా ఉత్తరాదిన పలు ప్రాంతాల్లో సిక్కులపై భారీ స్థాయిలో మూక దాడులు జరిగాయి. ఇందుకు సంబంధించి కొన్ని కేసుల్లో సజ్జన్ కుమార్ దోషిగా తేలారు. ఈ దాడుల్లో సిక్కుల వ్యాపారాలు, నివాససముదాయాలపై దాడులు జరిగాయి. అనేక మంది కన్నుమూశారు. అధికారిక గణాంకాల ప్రకారం, నాటి దాడుల్లో 3 వేల పైచిలుకు మంది కన్నుమూశారు. పలామ్ కాలనీ ఏరియాలో జరిగిన ఐదుగురి హత్య ఉదంతంలో ఢిల్లీ హైకోర్టు సజ్జన్ కుమార్‌ను 2018లో దోషిగా తేల్చింది. యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఆ తరువాత ఢిల్లీ సారస్వత్ నగర్‌లో ఇద్దరు సిక్కుల హత్య కేసులో ఢిల్లీ హైకోర్టు 2025లో యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. అయితే, ఢిల్లీలోని జనక్‌పురి, వికాస్‌పురి ప్రాంతాల్లో జరిగిన హింసాత్మక ఘటనల కేసులో మాత్రం సజ్జన్ పాత్రను నిరూపించే ఆధారాలు లేకపోవడంతో కోర్టులో విముక్తి లభించింది. జాట్ వర్గం కీలక నేత సజ్జన్ కుమార్ 1980ల్లో ఢిల్లీ రాజకీయాల్లో ప్రముఖ పాత్ర పోషించారు. 1977లో స్థానిక కౌన్సిలర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆయన ఆ తరువాత ఔటర్ ఢిల్లీ నియోజకవర్గం నుంచి మూడు సార్లు ఎంపీగా గెలిచారు.



# పాపం..వంశీమోహన్...కర్మ రిటర్న్

విజయవాడ, ఆగస్టు 20, ఉమ్మడి కృష్ణా జిల్లా రాజకీయాల్లో ఒకప్పుడు తిరుగులేని నాయకుడిగా, గన్నవరం నియోజకవర్గంలో చక్రం తిప్పిన మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పరిస్థితి ఇప్పుడు సొంత పార్టీలోనే అత్యంత దయనీయంగా మారిందనే చర్చ జోరందుకుంది. వైఎస్ఆర్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసేందుకు విమానాశ్రయానికి వెళ్లిన వంశీకి అక్కడ విచిత్రమైన, అవమానకరమైన పరిస్థితి ఎదురైంది. వీఐపీ విభాగానికి లేదా ప్రత్యేక పరిధికి అనుమతి దక్కకపోవడంతో, ఆయన సాధారణ కార్యకర్తలు, అభిమానులతో పాటు బారికేడ్ల వెనుక నిలబడాల్సి వచ్చింది. జగన్ బయటకు వచ్చే క్రమంలో ఆయన దృష్టిలో పడేందుకు మిగతా వారితో పాటు తోసుకుంటూ వెళ్లి పలకరించడానికి ప్రయత్నించిన దృశ్యాలు ఇప్పుడు సోషల్



మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఒకప్పుడు నియోజకవర్గంలో సొంత ముద్ర వేసుకుని, అసెంబ్లీలోనూ బలమైన నేతగా నిలిచిన వంశీలాంటి సీనియర్ నేత.. ఈ రకంగా పలకరింపు కోసం నిలబడటం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ వీడియోలు బయటకు రావడంతో సోషల్ మీడియా నెటిజన్ల నుంచి, ఆయన అభిమానుల నుంచి విభిన్న ప్రతిస్పందనలు వ్యక్తమవుతున్నాయి. గతంలో గన్నవరంలో ఒక వెలుగు వెలిగిన నాయకుడికి, ఈరోజు సొంత పార్టీ అధినేతను కనీసం గౌరవగా పలకరించే వెసులుబాటు కూడా లేకపోవడం ఏంటి అంటూ పలువురు సానుభూతి వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు మాత్రం అధికారంలో ఉన్నప్పుడు చేసిన అతి రాజకీయాలే ఆయనను ఈ స్థితికి తెచ్చాయని విమర్శిస్తున్నారు. ఈ ఘటనతో వల్లభనేని వంశీ అనుచరులు, స్థానిక వైఎస్ఆర్‌సీపీ శ్రేణులు తీవ్ర అసంతృప్తితో గుసగుసలాడుతున్నారు. నియోజకవర్గ స్థాయిలో సుదీర్ఘకాలం కీలకంగా వ్యవహరించి, పార్టీ కోసం అనేక రకాల సవాళ్లను ఎదుర్కొన్న మాజీ ఎమ్మెల్యేలకు, సీనియర్ నాయకులకు కనీస ప్రాధాన్యత ఇవ్వకుండా ఈ రకంగా విమానాశ్రయం బయట రోడ్డుపై లేదా బారికేడ్ల వెనుక నిలబెట్టడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని వారు అభిప్రాయపడుతున్నారు. పార్టీ నాయకత్వమే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, జగన్‌ను విడిగా కలిసే సమయాన్ని లేదా తగిన గౌరవాన్ని కల్పించి ఉండాల్సిందని స్థానిక నాయకత్వం బహిరంగంగానే పెదవి విరుస్తోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల పరాజయం తర్వాత వైఎస్ఆర్‌సీపీలో లీడర్‌షిప్ మేనేజ్‌మెంట్ స్పష్టంగా కనిపిస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు నడిచిన వ్యవస్థ వేరు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు శ్రేణులను, సీనియర్ నేతలను గౌరవించుకునే విధానం వేరు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం నిలబడిన మాజీ ఎమ్మెల్యేలను ఇలా సాధారణ కేడర్ తరహాలో నెట్టివేస్తే, రాబోయే రోజుల్లో మిగతా నేతల్లో కూడా నిరాశ పెరిగి పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. వంశీకి జరిగిన ఈ వీధి పరాభవం ద్వితీయ శ్రేణి నాయకుల్లో మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసే అంశంగా మారింది. గన్నవరం రాజకీయంలో ఎంతో ప్రాబల్యం ఉన్న వల్లభనేని వంశీకి ఎదురైన ఈ అనుభవం.. వైఎస్ఆర్‌సీపీలో నేతలకు దక్కుతున్న ప్రాధాన్యతపై అనుమానాలు రేకెత్తిస్తోంది. కేవలం ప్రచారానికి, కార్యకర్తలను సమీకరించడానికే సీనియర్లను వాడుకుని, అధినేతను కలిసే సమయంలో సాధారణ జనంలా నిలబెట్టే సంస్కృతి తగదని సొంత పార్టీ నేతలే భావిస్తున్నారు.

# కొత్త రిజర్వేషన్లతో ఎన్నికలు

విజయవాడ, ఆగస్టు 20, ఏపీలో త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. మున్సిపల్ ఎన్నికలకు ఏపీ ప్రభుత్వం బుధవారం నాడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలంటూ జీవో జారీ చేసింది. దాంతో ఏపీలో 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. 87 మునిసిపాలిటీ పాలక వర్గాల గడువు ఇప్పటికే పూర్తయింది. మరో 13 పాలకవర్గాల గడువు నవంబర్‌తో ముగియనుందని అధికారులు తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు నిర్వహణకుగానూ ఏపీ ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘంతో సమన్వయం చేసుకుంటోంది. కోర్టు కేసుల కారణంగా రాష్ట్రంలోని మరో 23 మున్సిపాలిటీలో ఎన్నికలు వాయిదా వేశారు. అర్బన్ మున్సిపాలిటీలు, పట్టణాల్లో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్‌తోనే ఎన్నికలు నిర్వహించనున్నారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఇటీవల ఆమోదించిన బీసీ రిసర్వేషన్‌లు అమలు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రత్యేక సమగ్ర సవరణ తుది జాబితాలతో కాకుండా 2025 నాటి ఓటర్ల జాబితాల ఆధారంగానే నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. అక్టోబరు 3న తుది జాబితాలు విడుదలయ్యే వరకు వేచి ఉంటే మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో తీవ్ర జాప్యం జరుగుతుందనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరులోనే ఎన్నికలు నిర్వహించాలని భావిస్తుండటంతో, ఓటర్ల జాబితాల రూపకల్పనకు రాఇఅ నోటిఫికేషన్ (నెం.401/రాఇఅ-ఈ1/2026-1) జారీ చేసింది. మున్సిపాలిటీల్లో సెప్టెంబర్ 3 నాటికి, పంచాయతీల్లో ఆగస్టు 17 నాటికి ఓటర్ల జాబితాల ప్రచురణ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల ప్రక్రియను ఆగస్టు 21 నుంచి 31 వరకు పూర్తి చేయనున్నారు. అదనపు బ్యాలెట్ బాక్సుల సేకరణతో పాటు 45 రోజుల్లోగా సిబ్బంది శిక్షణ ప్రక్రియను పూర్తి చేసేలా ఈసీ ఏర్పాట్లు ముమ్మరం చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనములు 4వ సవరణ బిల్లుకు రాష్ట్ర శాసనసభ ఆమోదం తెలిపింది. దీనిద్వారా రాష్ట్రంలో మేయర్, మున్సిపల్ చైర్మన్‌ల ఎంపికకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించేందుకు అవకాశం లభించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న పరోక్ష ఎన్నికల విధానంలో మార్పులు తీసుకువస్తూ ప్రభుత్వం ఈ చట్ట సవరణను చేపట్టింది. ఈ బిల్లును పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ బుధవారం నాడు సభలో ప్రవేశపెట్టారు. శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ఎన్నికల విధానానికి సంబంధించి కొన్ని చారిత్రక అంశాలను వెల్లడించారు. 1986 వరకు పరోక్ష ఎన్నికలు జరగగా, ఆ తర్వాత 1986 నుంచి 2005 వరకు ప్రత్యక్ష ఎన్నికల విధానం అమల్లో ఉండేదని గుర్తుచేశారు. అయితే 2005 నుంచి పరోక్ష ఎన్నికలు సాగుతున్నాయని, ప్రస్తుత సవరణ ద్వారా మళ్లీ ప్రత్యక్ష ఎన్నికల విధానానికి అవకాశం వచ్చిందన్నారు. ప్రజలు నేరుగా తమ నాయకుడిని ఎన్నుకోవడం వల్ల ఆ పదవుల్లో ఉన్నవారికి నమ్మకమైన ప్రజామోదం లభిస్తుందన్నారు. కౌన్సిలర్లు లేదా కార్పొరేటర్లపై ఆధారపడాల్సిన అవసరం ఉండకపోవడం వల్ల మేయర్, చైర్మన్లపై వారి అనవసర ప్రభావం ఉండదని స్పష్టం చేశారు. ఈ విధానం వల్ల వేగవంతమైన నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశం దక్కుతుందని, నగరాలు, పట్టణాలలో అభివృద్ధి ప్రాజెక్టులను త్వరితగతిన అమలు చేయవచ్చని మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, ప్రజా రవాణా, వ్యర్థాల నిర్వహణ, పట్టణ ప్రణాళిక వంటి మౌలిక వసతుల కల్పనలో దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించి అమలు చేయడం సాధ్యమవుతుంది అన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలతో మెరుగైన సమన్వయం సాధించి అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు ఇది తోడ్పడుతుందని చెప్పారు. నగరాలు, పట్టణాల్లో పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు పరిశ్రమలు, పర్యాటక రంగాలను ప్రోత్సహించేందుకు ప్రత్యక్షంగా ఎన్నికైన మేయర్ లేదా చైర్మన్‌కు పూర్తి వెసులుబాటు ఉంటుందని మంత్రి నారాయణ వివరించారు. ప్రత్యక్ష ఎన్నికల వల్ల అనవసర రాజకీయ ప్రభావం తగ్గి, ప్రజల నుంచి నేరుగా ఎన్నికైన నేతలు పట్టణాభివృద్ధిపైనే ప్రధానంగా దృష్టి సారిస్తుందన్నారు. కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలోని అన్ని వర్గాల ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సానుకూల ప్రయోజనాలన్నింటినీ దృష్టిలో ఉంచుకునే చట్ట సవరణ తెచ్చామని వివరించడంతో, బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. దాంతో ఇకపై మేయర్, మున్సిపల్ చైర్మన్ల ఎన్నిక ప్రత్యక్ష ఎన్నికల విధానంలో జరగనుంది.

# దసరాలో లోకల్ సందడి

విశాఖపట్టణం, ఆగస్టు20, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో భారీ ఎన్నికల సమరానికి తెరలేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం అత్యంత వేగంగా అడుగులు వేస్తోంది. బీసీ రిజర్వేషన్ల సమగ్ర అధ్యయనం కోసం వేసిన డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఇచ్చింది. అయితే ఆ నివేదికలో సిఫారసు చేసిన దాని కన్నా ఎక్కువగా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఖరారు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మరోవైపు సెప్టెంబర్ మొదటి వారంలోనే వార్డుల వారీగా తుది ఫొటో ఓటర్ల జాబితాలను ప్రచురించాలని ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా ఆదేశించడంతో కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. అంతా అనుకున్నట్లు సాగితే సెప్టెంబర్ చివరి వారం నుంచి అక్టోబర్ నెలల మధ్యలో ఏపీ అంతటా స్థానిక ఎన్నికల హడావుడి రావడం ఖాయంగా కనిపిస్తోందిఈసారి ఎన్నికల నిర్వహణలో అత్యంత ఆసక్తికరమైన అంశం ఓటర్ల జాబితా ఎంపిక. ఓటర్ల జాబితా సవరణ సుదీర్ఘ ప్రక్రియ వల్ల ఎన్నికల నిర్వహణ ఆలస్యం కాకుండా ఉండేందుకు 2025 నాటి స్పెషల్ సమ్మరీ రివిజన్ ప్రాతిపదికన ఎన్నికలకు వెళ్లాలని ఎస్ఈసీ వ్యూహాత్మకంగా నిర్ణయించింది. పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ, సవరణలతో పాటు ఇప్పటికే బీసీ డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదిక ను మించి దాదాపు 34% వరకు బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ సాంకేతిక, పరిపాలనా ముందడుగులు పరిశీలిస్తే ఎన్నికలను మళ్లీ వాయిదా వేసే ఉద్దేశంలో ప్రభుత్వం లేదని స్పష్టమవుతోంది. కూటమి ప్రభుత్వానికి ఈ స్థానిక ఎన్నికలు తమ రెండు సంవత్సరాల పరిపాలనా పనితీరుకు, ప్రజాదరణకు మొదటి అధికారిక టెస్ట్ లాంటివి . సాధారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన భారీ విజయం తర్వాత వచ్చే స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూల వేవ్ ఉండటం సహజం. మరోవైపు, పరాజయం నుంచి బయటపడే ప్రయత్నం చేస్తున్న వైఎస్సార్ సీపీకి ఈ స్థానిక సమరం ఊపిరి పీల్చుకునే అత్యంత కీలకమైన వేదిక. ప్రతిపక్ష హోదా కూడా దక్కని స్థితిలో ఉన్న వైసీపీ, స్థానిక సంస్థల ద్వారా క్షేత్రస్థాయి క్యాడర్‌లో మళ్లీ ఉత్సాహం నింపాలని భావిస్తోంది. గత ప్రభుత్వంలో క్షేత్రస్థాయిలో ఉన్న స్థానిక ప్రజాప్రతినిధుల బలంతో పాటు,వైసీపీ శ్రేణులు కనీసం వార్డు, పంచాయతీ స్థాయిలో పట్టు నిలుపుకోగలిగితే పార్టీకి కొత్త పునాది లభిస్తుంది. అందువల్లే, ప్రభుత్వం ఎంత వేగంగా ఎన్నికలకు వెళ్లినా వైసీపీ కూడా వెనకడుగు వేయకుండా పోరుకు సిద్ధమవుతోంది. ఎన్నికల వ్యూహాల పరంగా చూస్తే.. స్థానిక పోరులో పార్టీ గుర్తుపై జరిగే మున్సిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ పోల్స్ ఒకెత్తయితే, పార్టీ గుర్తులేని ఎన్నికలు మరొకెత్తు. పంచాయతీ ఎన్నికల్లో గ్రామాల్లో ఉండే పాత కక్షలు, వర్గపోరు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ రకమైన రాజకీయ సమీకరణాల్లో అధికార కూటమి మధ్య సీట్ల సర్దుబాటు కొన్ని చోట్ల క్షేత్రస్థాయిలో నాయకుల మధ్య సమన్వయ పరీక్షగా మారే ప్రమాదం కూడా ఉంది. దీన్ని వైకాపా తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేసే అవకాశం లేకపోలేదు. సెప్టెంబర్, అక్టోబర్ నెలలు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పూర్తి రాజకీయ వేడిని నింపబోతున్నాయి. పొలిటికల్ అట్మాస్ఫియర్ అంతా గ్రామ సర్పంచ్ నుండి మున్సిపల్ ఛైర్మన్ల దాకా ఆశావాహుల హడావుడితో మారబోతోంది. ఒకవైపు ప్రభుత్వం తన ఆధిపత్యాన్ని దిగువ స్థాయి దాకా విస్తరించాలని భావిస్తుంటే, మరోవైపు ఉనికి చాటుకోవడానికి వైసీపీ పోరాడుతోంది. కాబట్టి రాబోయే రెండు నెలలు ఏపీ వ్యాప్తంగా సంక్షేమ పథకాలు, స్థానిక సమస్యల చుట్టూ తిరిగే ఓట్ల పోరాటం అత్యంత ఉత్కంఠభరితంగా సాగడం ఖాయం.

# బొత్స అనూష పొలిటికల్ ఎంట్రీ...

విజయనగర్, ఆగస్టు 20, మాజీ మంత్రి, వైసీపీ నేతబొత్స సత్యనారాయణ కుమార్తె అనూష రాజకీయ రంగ ప్రవేశంపై క్లారిటీ వచ్చింది. బుధవారం రోజు మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా తన వారసురాలి రాజకీయ రంగ ప్రవేశంపై బొత్స సత్యనారాయణ కీలక వ్యాఖ్య లు చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తన కుమార్తె అనూష పోటీ చేస్తుందని బొత్స సత్యనారాయణ వెల్లడించారు. విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నికల్లో అనూషను బరిలోకి దింపనున్నట్లు తెలిపారు. ఎన్నికలు ఏ పద్ధతిలో జరిగినా, పోటీ చేయడం పక్కానని క్లారిటీ ఇచ్చారు. దీంతో బొత్స కుటుంబం నుంచి మరో తరం పొలిటికల్ ఎంట్రీకి ముహూర్తం ఖరారైందని రాజకీయ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు బొత్స అనూష వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. ఇప్పటికే అడపాదడపా రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొంటూ.. పొలిటికల్ ఎంట్రీకి సిద్ధమవుతున్నారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవికి అనూష బరిలోకి దిగుతూ ఉండటంతో విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నికలు ఈసారి మరింత ఆసక్తికరంగా మారాయి. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు, మరీ ముఖ్యంగా ఉత్తరాంధ్ర పాలిటిక్స్‌లో బొత్స కుటుంబం సుమారు నాలుగు దశాబ్దాలుగా కీలక పాత్ర పోషిస్తోంది. 1978లో విద్యార్థి నేతగా బొత్స సత్యనారాయణ రాజకీయ ప్రస్థానం మొదలైంది. ఆ తర్వాత విజయనగరం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షుడు అయ్యారు. 1999లో కాంగ్రెస్ తరుపున బొబ్బిలి ఎంపీ అయ్యారు. ఆ తర్వాత చీపురుపల్లి అసెంబ్లీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన బొత్స సత్యనారాయణ.. వైఎస్ఆర్, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి మంత్రివర్గాల్లో పనిచేశారు. ఏపీసీసీ అధ్యక్షుడిగానూ వ్యవహరించారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత వైసీపీలో చేరిన బొత్స.. జగన్ మంత్రివర్గంలోనూ పనిచేశారు. బొత్స సత్యనారాయణ సతీమణి బొత్స ఝాన్సీ కూడా రాజకీయాల్లో రాణించారు. రెండుసార్లు విజయనగరం జెడ్పీ ఛైర్ పర్సన్‌గా, ఓసారి విజయనగరం ఎంపీగా వ్యవహరించారు. బొత్స సత్యనారాయణ సోదరుడు బొత్స అప్పలనరసయ్య 2019 ఎన్నికల్లో గజపతినగరం నుంచి వైసీపీ తరుపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇప్పుడు బొత్స కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వస్తున్న నాలుగో వ్యక్తిగా బొత్స అనూష నిలవనున్నారు.

# గుంటూరు నగరంలో ట్రాఫిక్ నియంత్రణపై సమన్వయ సమావేశం

<u>అనధికార పార్కింగ్‌పై కఠిన చర్యలు</u>

<u>ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల సమన్వయంతో చర్యలు</u>

గుంటూరు , నగరంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, అనధికార పార్కింగ్‌ను నియంత్రించడం, వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టే అంశాలపై గురువారం టూరు ట్రాఫిక్ డీఎస్పీ ఆఫీసులో సమన్వయ సమావేశం నిర్వహించారు. గుంటూరు టౌన్ ట్రాఫిక్ డివిజన్ డీఎస్పీ బి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ, వెస్ట్ ట్రాఫిక్ సీఐలు, ట్రాఫిక్ ఎస్ఐలు పాల్గొని నగరంలోని ప్రధాన రహదారుల్లో నెలకొంటున్న ట్రాఫిక్ సమస్యలు, అనధికార పార్కింగ్‌పై సమీక్షించారు. ప్రధానంగా గుర్తించిన ప్రాంతాల్లో కాలేజీ బస్సులు, గూడ్స్ టెంపోలు, ప్రైవేట్ అంబులెన్సులు, ట్రావెల్ బస్సులు, కార్లు, క్రేన్లు, జేసీబీలు, ఇసుక లోడ్ వాహనాలు తదితర వాహనాలను రహదారులపై అనధికారికంగా నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. అదేవిధంగా అంబులెన్సుల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, హోటళ్ల ముందు ట్రావెల్ కార్లు, ఇతర వాహనాలను అస్తవ్యస్తంగా పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గుంటూరు నగరంలోని ప్రధాన రహదారులపై వాహనాల పార్కింగ్ కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా ట్రాఫిక్ పోలీసులు, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు.??ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నగరంలో వాహనాల రాకపోకలు సాఫీగా సాగేందుకు అనధికార పార్కింగ్‌పై కఠిన చర్యలు చేపట్టడంతో పాటు, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

# విద్యార్థులకు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం.

<u>- జీబ్రా క్రాసింగ్, ట్రాఫిక్ సిగ్నల్స్‌పై విద్యార్థులకు అవగాహన.</u>

<u>- పాదచారుల భద్రత, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన</u>

<u>.- ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు భద్రతకు సహకరించాలని సూచన.</u>

తిరుపతి 20 : తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు, తిరుపతి రామచంద్ర నగర్‌లోని చైతన్య టెక్నో స్కూల్లో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జీబ్రా క్రాసింగ్, ట్రాఫిక్ సిగ్నల్స్, పాదచారుల భద్రత, రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిర్వహణ చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రహదారులపై ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఇతరులకు కూడా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ట్రాఫిక్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ. సంజీవకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన పెంపొందించుకొని, సురక్షితమైన రహదారి ప్రయాణానికి సహకరించాలని పోలీసులు సూచించారు.

# వెనక్కి వచ్చేస్తున్న గుంటూరు మిర్చి



గుంటూరు, ఆగస్టు 20, మన గుంటూరు మిర్చి విదేశాల్లో ఉన్న గిరాకీని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అయితే, అదంతా అప్పుడు.. ఇప్పుడు విదేశాలకు వెళ్లిన మన మిర్చి తిరిగి వెనక్కి వచ్చేస్తోంది. దానికి అసలైన కారణం రసాయనాలు ఎక్కువగా వాడటం. పురుగుమందు అవశేషాలు ఎక్కువగా ఉండటంతో చైనా, శ్రీలంక వంటి దేశాలు మన మిర్చి ఉన్న కంటైనర్లను తిరిగి పంపించేసింది. ఇలాంటి సమయంలో రైతులు పాటించాల్సిన కొన్ని సూచనలను లాంఫాం శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. సేఫ్ కెమికల్స్ వాడితే విదేశాల్లో డిమాండ్ వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. గుంటూరు మిర్చికి ఉన్న డిమాండ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఒకప్పుడు ఈ మిర్చి కోసం విదేశీయులు కూడా పోటీపడేవారు. అయితే, ఇటీవల కాలంలో గుంటూరు మిర్చి ఏ దేశానికి వెళ్లిన తిరిగి మనకే వస్తుంది. దానికి అసలైన కారణం రసాయనాలు వాడటం. రసాయన అవశేషాలు.. అఫ్లాటాక్సిన్.. తేమశాతం ఎక్కువగా ఉందన్న కాలరణాలతో మిర్చిని తిరస్కరిస్తున్నాయి. ఇటీవల చైనా, శ్రీలంక దేశాలు మిరప కంటైనర్లను వెనక్కి తిరిగి పంపించాయి. ఇంకొన్ని దేశాలయితే ఆంక్షలు విధిస్తున్నాయి. ఇలాంటి సమయంలో మిర్చికి మంచి డిమాండ్ రావాలంటే లాంఫాం శాస్త్రవేత్తలు కొన్ని సూచనలు అందజేస్తున్నారు. ప్రస్తుతం మిర్చికి చీడపీడలు ఎక్కువగా పడుతుండటంతో రసాయనాలు వాడాలని రైతులు అంటున్నారు. అయితే, రసాయనాలు వాడకుండా కూడా మిర్చికి మంచి దిగుబడి తీసుకురావొచ్చని నిపుణులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని సూచిస్తున్నారు. మిరపకు సోకే పరుగులు, తెగుళ్ల వ్యాప్తిని తొలి దశలోనే గుర్తించి వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని చెబుతున్నారు. లింగాకర్షక బుట్టలు, పక్షి స్థావరాల ఏర్పాటుతో పాటు పంటలో అక్కడక్కడ బంతి, ఆముదం మొక్కలను ఎర పంటలుగా వేయాలని చెబుతున్నారు. ఒకవేళ రసాయనాలు వాడాల్సి వస్తే సేఫ్ కెమికల్స్ చల్లుకోవాలని సూచించారు. కాయలు కోయడానికి 25 రోజుల ముందుగా మాత్రమే రసాయనాలు చల్లాలని, దీని వల్ల పంటలో రసాయన అవశేషాల ప్రభావం చాలా వరకు తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. పంట కోతకి వచ్చినప్పుడు పూర్తిగా కాయ పండిన తర్వాతే కోసి ఆరబెట్టాలని, అప్పుడు మాత్రమే అమ్మకానికి సిద్ధం చేసుకోవాలని చెప్పారు. కోల్డ్ స్టోరేజ్‌ల్లో నిల్వ చేసేటప్పుడు కాయలను బాగా ఎండేలా చూడాలంటూ లాంఫామ్ శాస్త్రవేత్తలు వివరించారు. మన దగ్గర పండే మిరప సుమారు 30 శాతానికి పైగా ఎగుమతి అవుతుంది. చైనా, బంగ్లాదేశ్, శ్రీలంక, సింగపూర్, మలేషియాతో పాటు మిడిల్ ఈస్ట్ ప్రాంతాల్లో మన మిరపకు మంచి డిమాండ్. ఈ దేశాలన్నీ తమకు దిగుమతి అయ్యే పంటలో రసాయనాలు తక్కువగా ఉండేలా ఆహార ప్రమాణాలు సవరించాయి. మన మిరప రైతులు కూడా వాటికి తగ్గట్టుగానే సేంద్రియ పద్ధతుల్లో పండిస్తే మంచి గిరాకీ వచ్చే అవకాశం ఉంది

# అప్పన్న కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలి

విజయవాడ,గల్లంతైన మత్స్యకారుడు అప్పన్న ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని అధికారులకు హోంమంత్రి అనిత ఆదేశించారు. ఈ నెల 16న వేటకు వెళ్లిన 8 మంది మత్స్యకారుల్లో ఒకరు గల్లంతు అయ్యారు. మత్స్యశాఖ, మెరైన్ పోలీసులు, కోస్ట్ గార్డు సమన్వయంతో విస్తృతంగా గాలింపు చేపట్టాలని హోంమంత్రి అనిత సూచించారు. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారుల భద్రత విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. బాధిత మత్స్యకార కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది.. గాలింపు చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని అన్నారు.

## నేడు సూర్య దేవాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం..




విభారే న్యూస్ ఆగస్టు 20 కర్నూలు జిల్లా ప్రతినిధి..జయ గురుదత్త శ్రీ గురుదత్త శ్రీ మాత్రే నమః నేడు శ్రావణమాసం రెండవ శుక్రవారం వరలక్ష్మీ వ్రత పర్వదినం సందర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ఉదయం 10 గం లకు సామూహిక వరలక్ష్మీ వ్రతము జరుపబడును.(వ్రతము చేసుకొనదలచిన భక్తులు పంచామృతాలు, పండ్లు, పూలు, టెంకాయులు, తెచ్చుకొనగలరు)వ్రతమునకు:-250/-సంప్రదించవలసిన నెం :- డి.లక్ష్మీనరసింహ శర్మ.. 8008774086 ఫోన్ పే గూగుల్ పే నెంబరు..8896123777.ఆఫీసు ల్యాండ్ ఫోను నెంబరు..08518-234388.

## పార్కుకు బెంచీల వితరణ--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 20: నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్ పార్కులో గురువారం సేవా కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి సహకారంతో రూ.20 వేల విలువైన ఐదు సిమెంట్ బెంచీలను పార్కుకు వితరణ చేశారు. పార్కుకు వచ్చే ప్రజలు, వృద్ధులు సేదతీరేందుకు ఈ బెంచీలు ఉపయోగపడనున్నాయి.ప్రజలకు ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కార్యక్రమంలో పాల్గొన్న వారు పేర్కొన్నారు. పార్కులో మౌలిక సదుపాయాల కల్పనకు మరింత సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ సుధా ప్రసాద్ రెడ్డి, పీడీజీలు కల్లూరి రామలింగారెడ్డి, శ్రీరామ్మూర్తి, అసిస్టెంట్ గవర్నర్ దండే దస్తగిరి, డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, మాలెపాటి రాజశేఖర్, సుబ్బరామయ్య, లక్కా భూషణం, అయ్యన్న, చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. నయన ఐ కేర్, క్లియర్ వ్యూ లాసిక్ సెంటర్ ప్రతినిధులు సహకరించారు.

## మంగళ హరిద్రా స్వరూపిణిగా కామేశ్వరీ అమ్మ--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 20: వరలక్ష్మీ వ్రతం సందర్భంగా మహానంది పుణ్యక్షేత్రంలోని శ్రీ కామేశ్వరీ అమ్మవారు శుక్రవారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. పసుపుకొమ్మలతో సుందరంగా అలంకరించి, నిండు ముత్తైదువుగా, మంగళ హరిద్రా స్వరూపిణిగా అమ్మవారిని కొలువుదీర్చనున్నారు. వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని అమ్మవారి దర్శనం చేసుకునే భక్తులకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖసంతోషాలు, సౌభాగ్యం కలగాలని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పసుపుకొమ్మల అలంకరణలో అమ్మవారి దర్శనం భక్తులను విశేషంగా ఆకట్టుకోనుంది.అమ్మవారి కృపతో సకల శుభాలు కలగాలని కోరుతూ భక్తులు పెద్ద సంఖ్యలో మహానందికి తరలివచ్చే అవకాశం ఉంది. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.



# రాయలసీమకు నీరు విడుదల చేయాలి--

### శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి డిమాండ్--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 20: వర్షాభావ పరిస్థితులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న రాయలసీమ రైతాంగాన్ని ఆదుకునేందుకు శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వెలుగోడు, గోరుకల్లు, అవుకు, మైలవరం రిజర్వాయర్లకు వెంటనే నీటిని విడుదల చేయాలని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.నంద్యాల పద్మావతినగర్‌లోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో శ్రీశైలం నియోజకవర్గ




రైతులతో సమావేశమై తాగు, సాగునీటి సమస్యలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టులో 857 అడుగుల నీటిమట్టం, సుమారు 110 టీఎంసీల నీరు ఉన్నప్పటికీ దిగువకు నీరు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. ఆరుతడి పంటలు, పశువుల తాగునీటి అవసరాల కోసం తక్షణమే నీటిని విడుదల చేయాలని కోరారు.తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి పేరుతో శ్రీశైలం ఎడమగట్టు నుంచి నీటిని తరలిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోలేకపోతోందని విమర్శించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. రైతుల కోసం త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో రైతు నాయకులు, వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

# పోలో యాప్ దోపిడీ ముఠా అరెస్ట్--

### నలుగురు నిందితుల అరెస్ట్.. కత్తులు, రాడ్లు స్వాధీనం--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 20: పోలో యాప్ ద్వారా పరిచయం చేసుకుని యువకుడిని బెదిరించి నగదు, సెల్‌ఫోన్ దోపిడీ చేసిన నలుగురు నిందితులను నంద్యాల తాలూకా పోలీసులు అరెస్ట్ చేశారు. నంద్యాల-కొత్తపల్లి రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ఆగస్టు 15న ఈ ఘటన జరిగింది.బొల్లేద్దుల పవన్‌కుమార్, గుర్రం వెంకట నాగచరణ్, పసుపులేటి వెంకట ఉమాకాంత్, బాలశెట్టి హేమంత్‌లను నందమూరి నగర్ సమీపంలోని పీఏవీ వెంచర్స్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు కత్తులు, రెండు ఇనుప రాడ్లు, ఐదు సెల్‌ఫోన్లు, రూ.5,800 నగదు, హోండా ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు.పోలో యాప్ ద్వారా పరిచయమైన ఫిర్యాదిని ఫంక్షన్ ఉందంటూ తీసుకెళ్లి కత్తులతో బెదిరించి, ఇనుప రాడ్లతో దాడి చేసి రూ.7,200 నగదు, సెల్‌ఫోన్ లాక్కొని నిందితులు పరారయ్యారు. ఫిర్యాదు అందిన వెంటనే ఎస్పీ సునీల్ షొరాణ్ ఐపీఎస్ ఆదేశాలతో ఏఎస్పీ సుస్మిత ఐపీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టి నిందితులను పట్టుకున్నాయి.పోలో యాప్ ద్వారా ఇలాంటి ఘటనలకు గురైన బాధితులు ఎవరైనా ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన తాలూకా పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

# సర్వో ఆయిల్ తో ఇంజన్లు సురక్షితం

### వాహనదారుల భద్రతే ఇండియన్ ఆయిల్ కు ముఖ్యం: సర్వో ఆయిల్ రాయలసీమ రీజినల్ మేనేజర్ సురేంద్ర.

కర్నూలు ,ఆగస్టు 20: వాహనదారులు తమ వాహనాలకు సర్వో ఆయిల్స్ వాడకంతో వాహన ఇంజన్లు సురక్షితంగా ఉంటాయని సర్వో ఆయిల్స్ రాయలసీమ రీజినల్ మేనేజర్ సురేంద్ర చెప్పారు. వాహనదారుల భద్రతే ఇండియన్ ఆయిల్ సంస్థ కు ముఖ్యమని అన్నారు. గురువారం కర్నూలులో భారత ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ ఆయిల్స్ ఓ హోటల్లో నిర్వహించిన రీసెల్లర్ మీట్ లో ఆయన పాల్గొని వాహన వినియోగదారులు, రీసెల్లర్లతో మాట్లాడారు. ఆధునాతన టెక్నాలజీతో ఇండియన్ ఆయిల్స్ ఆధ్వర్యంలో




సర్వో లూబ్రికేంట్స్ సరికొత్త టెక్నాలజీతో కూడిన ఇంజన్ ఆయిల్స్ ను ప్రవేశపెట్టిందని చెప్పారు. సర్వో ఇంజన్ ఆయిల్ వాడకం వల్ల వాహనదారుల ఇంజన్లు సురక్షితంగా ఉండడంతో పాటు అత్యధిక కాలం మన్నికగా ఉంటాయని అన్నారు. సర్వో నూతనంగా ప్రవేశపెట్టిన హైపర్ సిరీస్ ఇంజన్ ఆయిల్స్ వాడకంతో అధిక మైలేజీ కూడా వస్తుందన్నారు .వాహన వినియోగదారులు చౌక ధరకు లభించే క్వాలిటీ లేని ఇంజన్ ఆయిల్ వాడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భారత ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ ఆయిల్ కు వాహనదారుల భద్రతే ముఖ్యమని స్పష్టం చేశారు. మిగతా ఇంజన్ ఆయిల్ కన్నా సర్వో ఇంజన్ ఆయిల్స్ అధిక శాతం నాణ్యంగా ఉంటాయని స్పష్టం చేశారు. ప్రజలు, వాహన వినియోగదారులందరూ తమ మోటారు వాహనాలు, కార్లు, కమర్షియల్ పెద్ద వాహనాలకు సర్వో ఇంజన్ ఆయిల్ వాడకంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. సర్వో హైపర్ సిరీస్ ఇంజన్ ఆయిల్ ఆధునిక టెక్నాలజీతో తయారు చేయబడిన ఫుల్ సింథటిక్ ఇంజన్ ఆయిల్ అని అన్నారు. ఈ సమావేశంలో ఏపీ, తెలంగాణ రీజినల్ హెడ్ అమర్ కుమార్ బలవంతరాయ్ తో పాటు కర్నూలు మేనేజింగ్ పార్ట్నర్ గోపాల కృష్ణారెడ్డి తదితర సర్వో ఆయిల్ రీసెల్లర్లు పాల్గొన్నారు.

## విత్తనాల పంపిణీకి సిద్ధం--




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 20: ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో రైతులకు అవసరమైన వివిధ రకాల విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా. కె. సుధీర్ తెలిపారు.రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించేందుకు పరిశోధనా కేంద్రంలో వివిధ రకాల విత్తనాలను సిద్ధం చేసినట్లు చెప్పారు. రైతులు విత్తనాల కోసం ముందుగా పరిశోధనా కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.విత్తనాల పంపిణీతో పాటు రైతులకు పంటల సాగు, విత్తన ఎంపిక, తెగుళ్ల నివారణపై అవసరమైన సాంకేతిక సూచనలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## నోటీసుల ప్రక్రియ వేగవంతం--

### పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 20: ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పెండింగ్ నోటీసులు, క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పాల్గొన్నారు.ఫారం 6, 7, 8 దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని, పెండింగ్ అధికంగా ఉన్న నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఈఓ సూచించారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటర్లుగా నమోదు అయ్యేలా కళాశాలల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని, ఆగస్టు 22, 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక ప్రచార దినాలు నిర్వహించాలని తెలిపారు.జిల్లాలో 80,283 నోటీసులు జారీ చేశామని కలెక్టర్ రాజకుమారి గణియా తెలిపారు. శ్రీశైలం నియోజకవర్గంలో పెండింగ్ నోటీసుల పంపిణీని త్వరగా పూర్తి చేస్తామని, ఫారం 6 దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్ఓ రాము నాయక్, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఈవీఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఆగస్టు 20: ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నెలవారీ తనిఖీల్లో భాగంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా నంద్యాల మార్కెట్‌యార్డులోని ఈవీఎం గోదామును తనిఖీ చేశారు. గోదాము వద్ద 24 గంటలూ పటిష్ట భద్రత, నిరంతర నిఘా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.సీసీ కెమెరాలు, సీలింగ్, అగ్నిమాపక భద్రత తదితర ఏర్పాట్లను పరిశీలించి, గోదాము రిజిస్టర్‌లో సంతకం చేశారు. కార్యక్రమంలో డీఆర్వో రామునాయక్, ఆర్డీవో విశ్వనాథన్, ఎన్నికల డీటీ మనోహర్, తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**